క్లుప్తంగా

గుర్ల ఎస్ఐగా నారాయణరావు


ఎస్ఐ నారాయణరావు

గుర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పిసిని నారాయణరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మహిళా పోలీస్ స్టేషన్ నుంచి బదిలీ పై ఇక్కడి వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు.యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా, తప్పుదోవ పట్టకుండా అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉజ్వల్ కనెక్షన్‌ల పంపిణీ


లబ్ధిదారులకు గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు అందజేస్తున్న నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస,దుగ్గవలస గ్రామాల్లో 26 మంది లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకంలో గ్యాస్‌స్టవ్‌లు, సిలిండర్లను ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గ బీజేపీ కో–కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మన్నెపురి సూర్యనారాయణ, స్థానిక నాయకులు రంగబాబు,శివ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు


హోమం చేస్తున్న ఆలయ ధర్మకర్త దంపతులు, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గరివిడి బంగారమ్మ కాలనీలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బమ్మిడి అప్పలస్వామి,కృష్ణవేణి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

జామి: మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షు డిగా పి.అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా ఎల్.అప్పలనాయుడు, కార్యదర్శిగా జి.బంగారునాయుడు, డైరక్టర్లుగా దాసరి అప్పలనాయుడు, పి.పైడిరాజు, రమణమ్మ,, భారతిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గురుకులంలో మిగులుసీట్లకు అడ్మిషన్లు

వేపాడ: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 30వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతా యని ప్రిన్సిపాల్ యు.ఉషారాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థినులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అయిదోతరగతిలో 35 సీట్లు, ఆరో తరగతిలో 8, ఏడో తరగతిలో 10, ఎనిమిదో తరగతిలో 14, తొమ్మిదో తరగతిలో 13 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 4 సీట్లు ఖాళీ ఉన్నట్లు వివరించారు.ఆసక్తి ఉన్న విద్యార్థినులు టీసీ, స్టడీ సర్టిఫికెట్, తల్లి,తండ్రి ఆధార్ కార్డు జెరాక్సులు, కుల, ఆదాయం ధ్రువపత్రాలు, అయిదు పాస్ పోర్టు సైజు కలర్ ఫొటోలు తీసుకుని నేరుగా పాఠశాలకు వచ్చి జాయిన్ కావచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు పదోతరగతి సప్లిమెంటరీలో పాస్ అయిన విద్యార్థినులు కూడా అర్హులేనని తెలిపారు.

చెరువులకు జలకళ


గర్భాంలో నిండుకుండలా ఉన్న చెరువు

మెరకముడిదాం: మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి చెరువులు జలకళను సంతరించుకున్నాయి.కొద్ది రోజుల క్రితం వరకూ వర్షాలు కురవకపోవడంతో నీరులేక వెలవెలబోయిన చెరువులు ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆందోళన చెందిన ఆయకట్టు రైతులు ఇప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే మరో రెండుమూడు పర్యాయాలు వర్షాలు కురిస్తే ఖరీఫ్ వరి పంటకు నీటితడుల సమస్య ఉండదని రైతులు చెబుతున్నారు.



ప్రజలు సహకరించాలి

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా 24 గంటలూ ఎంతో సహనంతో సిబ్బంది వైద్యసేవలు అందిస్తుంటారు. రోగుల సహాయకుల్లో కొందరు మద్యం తాగి వచ్చి సిబ్బంది తో దురుసుగా ప్రవర్తిస్తుంటారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన చాలా బాధాకరం. అటువంటి మానవ మృగాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విధుల్లో ఉన్న సిబ్బందితో దురుసుగా ప్రవర్తించే వారిని శిక్షించేలా చట్టాలు కఠినతరం చేయాలి. ప్రజలు సహకరిస్తేనే రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించగలం.

ఎం.అరుణకుమారి, గైనకాలజిస్ట్, గజపతినగరం ఏరియా ఆస్పత్రి



భద్రత అవసరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామ శివారులో ఉంది. రాత్రివేళ జనసంచారం ఉండదు. మహిళా సిబ్బంది రాత్రి సమయాల్లో భయం భయంతో విధులు నిర్వహించాల్సి వస్తోంది. ప్రభుత్వం నైట్ వాచ్‌మన్‌ను, సెక్యూరిటీ గార్డులను నియమించాలి. రాత్రి వేళ కనీసం ఒక పోలీస్ అయినా ఆస్పత్రి వద్ద ఉంటే ధైర్యంగా పని చేయగలం. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసిన నిందితులను త్వరగా శిక్షించాలి. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

పుష్పాంజలి, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి



వీఓఏలు, బుక్‌కీపర్ల తొలగింపు అన్యాయం

- ప్రజలకు మేలు చేస్తే సహకరిస్తాం... కీడు చేస్తే పోరాడతాం
- విలువలతో కూడిన రాజకీయం చేయాలి: మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు వెలుగు సమాఖ్యలో పని చేస్తున్న పలువురు బుక్ కీపర్లతో పాటు వీఓఏలను అధికారులు తొలగిస్తుండడం అన్యాయమని గజపతినగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు గ్రామాల్లో వీఓఏలు, బుక్ కీపర్లతో పాటు, శానిటేషన్ వర్కర్లను ఇష్టానుసారం తొలగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నోఏళ్లుగా పనిచేస్తున్న వారిని టీడీపీ నాయ కులు రాజకీయకక్షతో తొలగించాలని చూస్తున్నారని, వారికి అధికారులు సహకరించడం మంచి పద్ధతి కాదన్నారు. జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆపార్టీ నేతలు కొంతమంది డమ్మీ చేసి ఆడిస్తున్నారని, అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీఓఏలు, బుక్‌కీపర్లను నచ్చినట్లు తొలగి స్తామంటే కుదరని, వారికి సంఘాలు ఉన్నాయని, ఆ సంఘాల తీర్మానం లేనిదే ఎవరినీ తొలగించడానికి వీలులేదన్నారు. మంత్రితో పాటు టీడీపీ నాయకులు ఇలాంటి పనులపై కాకుండా ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించాలని హితువు పలికారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ కూటమి నాయకులు గొప్పగా ప్రచారం చేసుకున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరచిపోయారని అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన పలు అభివృద్ధి పనులు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడివక్కడ నిలిచిపోయాయని, ఏ పంచాయతీలోనూ ఎలాంటి అభివృద్ధి పనులూ జరగడం లేదని ఆరోపించారు. కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పే మాటలకు, చేస్తున్నపనులకు పొంతనే లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక మొదలయ్యిందని చెప్పారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలని, కుట్రపూరిత,స్వార్థపూరిత రాజకీయాలు తగవన్నారు.

ప్రజల పక్షాన నిలబడదాం...

కూటమి ప్రభుత్వ విధానాలతో గ్రామాల్లో అన్యాయం జరిగే ప్రజల పక్షాన నిలబడి, వారికి న్యాయం జరిగేలా సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోరాడాల ని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు.త్వరలో గ్రామాల్లో పర్యటించి ప్రజల కష్టనష్టాలను తెలుసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే పనులు చేస్తే స్వాగతించి, సహకరిస్తామని, కీడు చేస్తే ప్రజల పక్షాన నిలబడి పోరాడతామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సీనియర్ నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, కర్రి రామునాయుడు, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


గంబూషియా చేప పిల్లలను చెరువులో విడిచిపెడుతున్న సర్పంచ్ ఈశ్వరరావు,వైద్య సిబ్బంది

బొండపల్లి: దోమల నివారణ చర్యల్లో భాగంగా చెరువులు, కోనేర్లు, గుంతల్లో గంబూషియా చేప పిల్లలను విడిచి పెడుతున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ,సమీర తెలిపారు. మండల కేంద్రంలోని కోమటి చెరువులో సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు ఆధ్వ ర్యంలో ఆదివారం గంబూషియా చేపపిల్లను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ద్వారా చికున్ గున్యా, మలేరియా, డెంగ్యూ, తదితర ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, చెరువులు, గుంతల్లో గంబూషియా చేప పిల్లలను వదలడం వల్ల అవి దోమల దోమల లార్వాను తినేస్తాయని, దీంతో దోమల వృద్ధిని తగ్గించవచ్చన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఏ.బాషా, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్ లైసెన్స్ రద్దు ..

- సాక్షి ఎఫెక్ట్

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న వేంకటేశ్వర జనరల్ స్టోర్ ఎరువుల దుకాణం లైసెన్స్‌ను వారం రోజులు రద్దు చేస్తూ వ్యవసాయ శాఖ విజయనగరం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎ. నాగభూషణరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఏపీ కావాలని అడిగిన రైతులకు గుళికలు అంటగడుతున్న వైనంపై సాక్షిలో ఈ నెల 21న 'అది కొంటేనే ఇది' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి వ్యవసాయాధికారులు స్పందించి ఎరువుల దుకాణ యజమానికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అయితే సంబంధింత యజమాని ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో లైసెన్స్ రద్దు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నెల 26 నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన దీపేష్

అక్కిరెడ్డిపాలెం: మేడపై జీఐ వైరుతో ఆడుకుంటున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురై.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాజువాకలోని ఆర్‌హెచ్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాజువాక సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా గుర్ల మండలం గవిడిపేటకు చెందిన గవిడి త్రినాథరావు, భార్య, ఇద్దరు పిల్లలు గవిడి దీక్షిత్, దీపేష్(9)తో గాజువాక శ్రీనగర్ దిబ్బపాలెం , ఆర్‌హెచ్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. 20 ఏళ్ల నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఎల్ఎంఎంఎం క్యాంటీన్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. ఆదివారం అతని చిన్న కుమారుడు దీపేష్ ఇంటి మేడపై జీఐ వైర్‌తో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో హైటెన్షన్ తీగకు జీఐ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. ఇది గమనించిన దీపేష్ బంధువు గట్టిగా కేకలు వేశాడు. వెంటనే దీపేష్‌ను అతని తండ్రి దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. త్రినాథరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

సీఆర్పీలకు సన్మానం


సీఆర్పీలను సన్మానించి సర్టిఫికెట్ అందజేస్తున్న మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు దుర్గ

గంట్యాడ: ఉత్తమ పనితీరు కనబరిచిన అయిదుగురు సీఆర్పీలను కొఠారుబిల్లి జంక్షన్‌లోని వెలుగు కార్యాలయంలో అధికారులు ఆదివారం సన్మానించి, సర్టిఫికెట్‌లు అందజేశారు. అంతకుముందు లఖ్‌పతి దీదీ పథకం లక్ష్యాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని వెలుగు కార్యాలయంలో మండ ల సమాఖ్య పాలకవర్గ సభ్యులు, కార్యనిర్వాహక సభ్యులు, సీఆర్పీలు, వీఓఏలు ఆదివారం వీక్షించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను లక్షాధికా రులను చేసేందుకు ప్రణాళికలను ప్రధాని వివరించారు. వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఆదియ్య, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు చినబాబు, అచ్చంనా యుడు, ముత్యాలనాయుడు, మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు సీహెచ్. దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు


వేపాడలోని గోపాలకృష్ణ ఆలయంలో పూజలందుకుంటున్న స్వామివారు

వేపాడ: మండల కేంద్రంలోని గోపాలకృష్ణాలయంలో సోమ,మంగళవారాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు గోపాలకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో సోమవారం అష్టోత్తర శతనామ పూజలు, అభిషేకాలు చేయనున్నామని, రాత్రికి ఉట్టుకొట్టే సంబరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంగళవారం రుక్మిణీ,సత్యభామ సమేత గోపాలకృష్ణ కల్యాణ మహోత్సవం, అన్నసమారాధన, అదే రోజు సాయంత్రం వేపాడ–వల్లంపూడి జంటగ్రామాల్లో స్వామివారి ఊరేగింపు ఉంటుందని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. అలాగే బక్కునాయుడుపేట, కృష్ణారాయుడుపేట,బొద్దాం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్న సమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అధ్వాన రహదారితో అవస్థలు


గోతులమయమైన అలమండ రైల్వేస్టేషన్ రహదారి

జామి: మండల కేంద్రం నుంచి అలమండ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. దీంతో ఈమార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మలుపుల వద్ద ఉన్న గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షాలు కురిసే సమ యాల్లో గుంతల్లో నీరు నిలిచిపోతుండడంతో ద్విచక్ర వాహనచోదకులు వాటిని అంచనా వేయలేక పల్టీలు కొడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో మానసిక వైద్యసేవలు రేపు

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఈనెల 27వ తేదీన మానసిక వైద్యసేవలు అందించనున్నట్లు వైద్యాధికారి స్రవంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మానసిక వైద్యుల బృందం ఉదయం 10 గంటల నుంచి పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటారని, మానసిక సమస్యలు ఉన్నవారు వైద్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మనోవ్యాధులతో బాధపడే వారికి, మానసిక సమస్యలున్న వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి మందులు ఇస్తారని పేర్కొన్నారు.

టీడీపీ నేతల చేతివాటం

గుర్ల: మండలంలోని దమరసింగి రైతుసేవా కేంద్రంలో రైతులకు రాయితీపై ఎరువుల విక్రయాల్లో స్థాని క టీడీపీ నేతలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని సర్పంచ్ మీసాల కల్యాణి, పలువురు రైతులు ఆరోపి స్తున్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సచివాలయంలో వీఏఏ లేకపోవడంతో ఎరు వుల విక్రయాల బాధ్యతను స్థానిక టీడీపీ నేతలకు వ్యవసాయ అధికారులు అప్పగించారు. అయితే టీడీపీ నాయకులు యూరియా బస్తాపై ప్రభుత్వం నిర్దేశించిన ధరకంటే అదనంగా రూ.30 తీసుకుం టున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈవిషయం ఏఓ తిరుపతిరావు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అంటున్నారు.

గంజాయి స్వాధీనం

డెంకాడ: మండలంలోని గుణుపూరు జంక్షన్ వద్ద ముగ్గురు యువకుల నుంచి 300 గ్రాము ల గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్న ట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరానికి చెందిన ముగ్గురు యువకులు గంజా యి సేవించేందుకు వెళ్తుండగా..ముందుగా అందిన సమాచారం మేరకు వారిని అదుపులో కి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రెండు మోటార్ సైకిళ్లు, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేశామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మూడు కిలోలు..

విజయనగరం క్రైమ్: స్థానిక బాబామెట్ట సమీపంలో ఇద్దరు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఖాదర్‌నగర్‌కి చెందిన యల్లాజీ, లెప్రసీ కాలనీకి చెందిన బో ని యేసులను అరెస్ట్ చేశామన్నారు. ఆదివారం రాత్రి తనిఖీలు చేపడుతుండగా నిందితులు పట్టుబడ్డారన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహనరావు, దామోదరరావు అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలోని గీతాశ్రమంలో భగవద్గీత పారాయణం ఆదివారం చేపట్టారు. వారు మాట్లాడుతూ భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, భగవద్గీత చదివితే మనసు ప్రశాంతంగా ఉండడంతో పాటు ఉత్తమ జీవనం అలవడుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

విద్యుత్ లైన్లను మార్చాలి


విద్యుత్ వైర్లను ఇళ్లపై నుంచి మార్చాలని ఆందోళన చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువ వీధి ఎస్సీ కాలనీలో ఇళ్ల మీదుగా ఉన్న 33/11 కేవీ విద్యుత్ తీగలను మార్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఆదివారం సాయంత్రం కాలనీ వాసులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ తీగలు మేడపైకి ఆడుకునేందుకు వెళ్లే పిల్లలకు తగిలే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి ఏదైనా ప్రమాదం జరగక ముందే వైర్లను ఇళ్లపై నుంచి తొలగించాలని కోరారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్ పోటీల్లో గురుకుల విద్యార్థినులు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులతో పీఈటీ


షాట్‌పుట్ పోటీల్లో బాల్‌ను త్రో చేస్తున్న గురుకుల విద్యార్థిని ప్రణతి

వేపాడ: జిల్లా కేంద్రం విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో నాలుగు రోజుల పాటు నిర్వ హించనున్న సౌత్ జోన్ అథ్లెటిక్ పోటీలు ఆదివారం ప్రారంభమ్యాయి. ఈపోటీల్లో వేపాడ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల నుంచి 10 మంది విద్యార్థునులు పాల్గొంటున్నట్లు పీఈటీలు అరుణ,ధనలక్ష్మి తెలిపారు. అండర్–14, 16,18 విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. నాలుగురోజుల పోటీలు ముగిసిన తర్వాత విజేతలను ప్రకటిస్తారని తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలతో జీవనోపాధి..

- సమయానికి కురవని వానలు
- వరి నుంచి ఉద్యానవన పంటల వైపు రైతన్న చూపు
- కూరగాయలు, పూలు, పండ్ల సాగుపై కూడా ఆసక్తి


పూసపాటిరేగలో క్యాప్సికమ్ సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

పూసపాటిరేగ : వర్షాభావ పరిస్థితులు.. ప్రతి ఏటా పెరుగుతున్న పెట్టుబడులు.. వరి పంట గిట్టుబాటు కాకపోవడం.. తదితర కారణాలతో రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలవైపు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా వాతావరణం అనుకూలించకపోవడంతో ఖరీఫ్ సాగు మధ్యలోనే ఆగిపోయింది. నియోజకవర్గంలో 25 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా కేవలం 8,500 ఎకరాల్లోనే వివిధ పంటలు సాగవుతున్నాయి. అందులోనూ వరి పంటకు సంబంధించి కేవలం 38 శాతం నాట్లు మాత్రమే పడ్డాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అన్నదాతలు ఆరుతడి పంటలపై దృష్టి సారించారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు ముందుగా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల , డెంకాడ మండలాల రైతులు కూరగాయలు, పండ్లు, పూల సాగుపై ప్రధానంగా దృష్టి సారించారు. పూసపాటిరేగ మండల పరిధిలో కుమిలి, రెల్లివలస, పేరాపురం, వెంపడాం, తాళ్లపేట, గోవిందపురం, పూసపాటిపాలెం, కొవ్వాడ అగ్రహారం, గుంపాం, పూసపాటిరేగ, సీహెచ్ అగ్రహారం, పతివాడ, చౌడువాడ గ్రామాలలో కూరగాయల సాగు ఎక్కువగా జరుగుతోంది. తీరప్రాంత గ్రామాలలో బోర్ల కింద మిరప, దొండ, బెండ, బీర, కాకర, క్యాప్సికమ్, టమాటా వంటి పంటలు సాగు చేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 800 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. నెల్లిమర్ల మండలం టెక్కలి, కొండవెలగాడ, చంద్రమ్మపేట.. భోగాపురం మండలం చాకివలస, తూడెం గ్రామాలలో బంతి, గులాబి, చామంతి, మల్లి, తదితర పూల తోటలు సాగు చేస్తున్నారు. రెండు మూడు నెలల్లో దిగుబడులు చేతికి అందడంతో పాటు ఎరువులు, పురుగు మందులు ఖర్చులు తక్కువ కావడంతో రైతులు కూరగాయలు, పూలతోటలు వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.


పూసపాటిరేగ పెట్రోల్‌బంకు సమీపంలో సాగులో ఉన్న టమాటా పంట

ఎన్నో రాయితీలు..

కూరగాయల సాగుకు ఉద్యానవనవన శాఖ ద్వారా ఎకరాకు ఆరు వేల రూపాయల వరకు రాయితీ కల్పిస్తున్నాం. బంతి, చామంతి, గులాబి, మల్లి వంటి పూలతోటలకు ఎకరాకు రూ. 6400 వరకు రాయితీ వస్తుంది ప్రతి రైతుకూ గరిష్ఠంగా 2.5 ఎకరాలకు రాయితీ వచ్చే అవకాశం ఉంది. ఉద్యానవన శాఖ సహాయకులను కలిస్తే రాయితీల కోసం ఎలా దరఖాస్తు చేయాలో వివరిస్తారు.

– జ్యోత్స్న, ఉద్యానవనశాఖ అధికారి, భోగాపురం

పూలసాగుతో అధిక లాభాలు

పూల సాగులో ఎరువులు, పురుగు మందుల పెట్టుబడి తక్కువ. రెండు నెలల నుంచి చేతికి పంట అందుతుంది. నిత్యం పూలు పూయడంతో సాగు మదుపులకు ఇబ్బంది ఉండదు. ఖరీఫ్ సాగులో వర్షాభావ పరిస్థితుల కారణంగా మదుపు పెట్టినా నష్టం వచ్చే పరిస్థితి కనబడుతోంది. ప్రత్యమ్నాయ పంటలు వైపు దృష్టి సారించడమే మేలు.

– ఎం. నారాయణప్పారావు, రైతు చౌడువాడ